సాక్షి సిద్దిపేట

బుధవారం : 5 : జూలై : 2023



గజ్వేల్‌లో హైటెన్షన్..

గజ్వేల్ పోలీసుల చక్రబంధంలో కొనసాగుతుంది. ఛత్రపతి శివాజీ విగ్రహం ఘటనలో పట్టణంలో మంగళవారం 144 సెక్షన్ విధించారు.

8లో..



డ్రైవింగ్ లైసెన్సుల శిబిరానికి స్పందన

దుబ్బాక నియోజకవర్గంలోని 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో టూ వీలర్, త్రీ వీలర్, ఫోర్ వీలర్ లైసెన్స్‌లు ఇప్పించేందుకు ముందుకొచ్చారు.

9లో..

అన్ని రంగాల్లో జిల్లా ఆదర్శం

చిన్నకోడూరు(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. మంగళవారం ఆమె చిన్నకోడూరులో మాట్లాడుతూ ట్రిబుల్ ఐటీలో జిల్లాకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. మండలం నుంచి 47 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మంత్రి హరీశ్‌రావు చొరవతో సిద్దిపేట విద్యాక్షేత్రంగా మారుతుందన్నారు.

న్యూస్‌రీల్

పోర్టల్‌పై అవగాహన



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

సిద్దిపేటరూరల్: న్యూఢిల్లీ నుంచి కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు నేషనల్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ పోర్టల్‌పై మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోర్టల్‌ను ఉపయోగించి ఓటర్ జాబితా, ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో ఉత్పన్నమయ్యే సందేహాలను, ఫిర్యాదులను ఓటర్ల నుంచి స్వీకరించి వాటిని త్వరగా పరిష్కరించే విధానంపై అవగాహన కల్పించారు. అదే విధంగా అధికారులు ఎన్నికల ప్రక్రియపై ప్రజలకు వివరించాలని అన్నారు. కాన్ఫరెన్స్‌లో ఎలక్షన్ డీటీ శ్రీనివాస్, ఈడియం ఆనంద్ పాల్గొన్నారు.

సంఘటితంగా ఉద్యమిద్దాం

సిద్దిపేటజోన్: అసంఘటిత కార్మికులకు న్యాయం చేయడానికి సంఘటితంగా ఉద్యమిద్దామని అఖిల భారత మజ్దూర్ సంఘ్ (బీడీ) ఆర్గనైజింగ్ సెక్రెటరీ శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం బీఎమ్మెస్ ఆధ్వర్యంలో స్థానిక కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా పాత జీఓలనే ప్రభుత్వం అమలు చేస్తుందని విమర్శించారు. కనీస వేతనాల అమలు చట్టం నిబంధనలు పాటించాలని కోరారు. కనీస వేతన మండలిలో స్థానిక కార్మిక నేతలకు అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజిరెడ్డి, కొండల్ రెడ్డి, సరిత, మల్లేశం, కిష్టయ్య పాల్గొన్నారు.

చెట్లను నరికితే చర్యలు

సాక్షి ఎఫెక్ట్

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా, వ్యవసాయ క్షేత్రాల్లో చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హుస్నాబాద్ ఫారెస్టు రేంజ్ అధికారి సందీప్ హెచ్చరించారు. ఈ నెల 3వ తేదీన 'యథేచ్ఛగా కలప అక్రమ రవాణా... పోతారం(జే)లో జోరుగా చెట్ల నరికివేత' అంటూ 'సాక్షి' లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా కలప వ్యాపారి బాషబోయిన కొమురయ్యకు రూ.15వేల జరిమానా విధించినట్లు అధికారి తెలిపారు. చెట్లను నరకాలంటే అటవీ, రెవెన్యూ శాఖల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

డాక్టర్లకు సన్మానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రపంచ డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ సోమ వనజ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శిశుమందిర్‌లో డాక్టర్లను సన్మానించారు. డాక్టర్లు కాశీనాథ్, శ్రీనివాస్, సుధీర్‌కుమార్, ఆదిత్య, అనిల్‌కుమార్‌లను, గురుపౌర్ణమిని పురస్కరించుకుని శిశుమందిర్ ప్రధాన ఆచార్యులు నరేష్‌ను సత్కరించారు. మిత్రక్లబ్ అధ్యక్షులు ఈశ్వర్‌చరణ్ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

సిద్దిపేటఎడ్యుకేషన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ సిద్దిపేట ప్రాంతీయ కేంద్రం కోఆర్డినేటర్‌గా ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మధుసూదన్ నియామకమయ్యారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ ఆధ్వర్యంలో మంగళవారం రీజనల్ కోఆర్డినేటర్‌గా మధుసూదన్ బాధ్యతలు స్వీకరించారు. వైస్ ప్రిన్సిపాల్‌తో పాటు ఆయా విభాగాల కోఆర్డినేటర్లు డాక్టర్ గోపాల సుదర్శనం, డాక్టర్ భవాని, డాక్టర్ పల్లవి, డాక్టర్ మల్లేశం, డాక్టర్ సుజాత ఆయనను అభినందించారు.

కరపత్రం ఆవిష్కరణ

సిద్దిపేట ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాలలో నిర్వహించనున్న జాతీయస్థాయి సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ మాట్లాడారు. రాష్ట్ర ఉన్నత విద్య కౌన్సిల్ సహకారంలో కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 న జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. పరిశోధన కోసం రసాయన, అనుబంధ శాస్త్రాల్లో ప్రస్తుత పోకడలు, సవాళ్లు అనే అంశంపై నిర్వహించే ఈ సదస్సులో రాష్ట్రాల పరిశోధన, పీజీ విద్యార్థుల నుంచి పరిశోధనా పత్రాలను స్వీకరిస్తామన్నారు. సదస్సుకు సీఎస్ఐఆర్, నిట్, నైపర్, ఉస్మానియా, సెంట్రల్ యూనివర్సిటీల నుంచి రీసోర్స్ పర్సన్లు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో సదస్సు కన్వీనర్, కెమిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ వాసం శ్రీనివాస్, అంజనేయులు, శ్యాంసుందర్, రవికుమార్, సుమలత, సలీంపాషా, బాలకృష్ణ, భవాని, శ్రీనివాసరావు, పల్లవి, శైలజ, వేణు పాల్గొన్నారు.

మరో ముందడుగు

- సిద్దిపేటలో పప్పు దినుసుల తయారీ ఫ్యాక్టరీ
- మార్కెటింగ్ రంగంలోకి రైతు
- ఇప్పటికే వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి



సిద్దిపేట మార్కెట్ యార్డులో కందులు (ఫైల్)

సిద్దిపేటజోన్: ప్రస్తుతం పత్తి అంతర పంటగా సాగు చేసున్న పప్పు దినుసులకు మహర్దశ పట్టనుంది. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ ఆధ్వర్యంలో రూ.5 కోట్లతో పప్పుదినుసుల తయారీ ఫ్యాక్టరీ రానుంది. అందుకు సిద్దిపేట పరపతి సహకార సంఘం (పీఏసీఎస్)ను ప్రయోగాత్మకంగా ఎంచుకున్నారు. ఇప్పటికే మిట్టపల్లిలో స్వయం సహాయక సంఘాల మహిళలు కంది పప్పు తయారీ ద్వారా స్వయం ఉపాధి పొందుతూ ఆదర్శంగా నిలిచారు.

- జిల్లాలోని గజ్వేల్, దుబ్బాక, చేర్యాల, సిద్దిపేట, అక్కన్నపేట, మర్కూక్, కొమురవెల్లి, మద్దూర్, జగదేవ్‌పూర్, దౌల్తాబాద్ లాంటి ప్రాంతాల్లో పత్తి అంతర పంటగా కందులు సాగు చేస్తున్నారు.
- ప్రభుత్వ రికార్డుల ప్రకారం జిల్లాలో 35 వేల ఎకరాల్లో కంది అంతర పంటగా సాగుకు నోచుకోగా, ప్రధాన పంట రూపంలో సుమారు 15 వేల ఎకరాల్లో పండిస్తున్నారు.
- 2019లో ప్రభుత్వం అంతర పంటలను ప్రోత్సహించే ప్రణాళికలలో భాగంగా జిల్లాకు 50 వేల ఎకరాల లక్ష్యాన్ని నిర్దేశించింది.
- ఏటా కేవలం సిద్దిపేట పత్తి మార్కెట్ యార్డులో సుమారు 6 వేల క్వింటాళ్లను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేస్తారు.
- దీనికి దరిదాపులో ప్రైవేట్ వ్యాపారులు సైతం కొనుగోలు చేస్తుంటారు. ప్రభుత్వం కందులు క్వింటాల్‌కు రూ.6,800 మద్దతు ధర ప్రకటించింది.
- పల్స్ రైతులకు స్వయం ఉపాధి అవకాశాలు మరింత దగ్గర తెచ్చేందుకు మంత్రి హరీశ్‌రావు ప్రణాళికలు తయారు చేశారు.
- అందులో భాగంగానే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ (ఎంఎస్ఎంఈ) ఆధ్వర్యంలో సిద్దిపేటలో పప్పుల ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

రూ.5 కోట్లతో భారీ ప్రాజెక్టు

- రూ. 5 కోట్ల భారీ అంచనాలతో ప్రాజెక్టు రూపకల్పన చేశారు. అందుకు సిద్దిపేట పీఏసీఎస్ పరిధిలోని రైతులను ప్రయోగాత్మకంగా ఎంపిక చేశారు.
- 90 శాతం సబ్సిడీపై ప్రాజెక్టు పరిధిలోని పల్స్ రైతులకు ప్రయోజనం కలగనుంది. అయ్యే ఖర్చులో 10% సొసైటీ భరించాలి, మిగితా 90 శాతం ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.
- ఫ్యాక్టరీ ఏర్పాటు, పరికరాలు, యంత్రాల బిగింపు, రైతులకు శిక్షణ లాంటి ప్రక్రియ అంతా ఎంఎస్ఎంఈ సంస్థ పర్యవేక్షణలో జరుగనుంది.
- పప్పు దినుసులు పండించిన రైతుల పంటను వాళ్లే ఫ్యాక్టరీలో ప్రాసెసింగ్ చేసుకొని ప్యాకింగ్ చేసి మార్కెటింగ్ చేసేలా సంస్థ చూస్తుంది.
- వచ్చిన లాభాలను అదే సొసైటీ పరిధిలోని రైతులకు చెందేలా ప్రభుత్వం ప్రణాళికలు తయారు చేసింది.
- అందుకు అనుగుణంగా గత నెల 12వ తేదీ నుంచి 21 వరకు సిద్దిపేట పీఏసీఎస్ పరిధిలోని రైతుల సమగ్ర వివరాలను అధికారులు సేకరించారు.
- పీఏసీఎస్ పరిధిలోని 1,150 మంది రైతుల ఆర్థిఫికేషన్ వెరిఫికేషన్ ప్రక్రియ సైతం పూర్తి చేశారు.
- భవిష్యత్‌లో ఇక్కడి రైతులు తాము పండించిన పప్పు దినుసులను ప్రాసెసింగ్ చేసి ప్యాకింగ్ మార్చి మార్కెటింగ్ చేసే అవకాశం ఉంటుంది.

రైతులకు శుభవార్త



సిద్దిపేట పీఏసీఎస్ సొసైటీ పరిధిలో పప్పు దినుసులు పండించే రైతులకు ఇది శుభవార్త. పప్పుల ఫ్యాక్టరీ ఏర్పాటుతో రైతులకు ప్రయోజనం. పండించిన పప్పు దినుసులను మార్కెటింగ్ చేసుకునే అవకాశం రావడం సంతోషకరం. మంత్రి హరీశ్‌రావుకు సొసైటీ తరఫున కృతజ్ఞతలు.

– నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్, సిద్దిపేట



గౌరవెల్లి ప్రాజెక్టులోకి ఆగిన నీటి ఎత్తిపోత

నాలుగు రోజులకే ఆపేశారు

గౌరవెల్లికి నీటిని ఎత్తిపోసే పంపును నిలిపివేసిన అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టులో గోదావరి జలాలు నింపే ప్రక్రియ ఆగిపోయింది. జూన్ 29వ తేదీన ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ తోటపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని విడుదల చేసేందుకు ఒక పంప్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. కాగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ సోమవారం సాయంత్రం నిలిపివేశారు. నాలుగు రోజుల పాటు నిరంతరంగా కొనసాగిన క్రమంలో 0.02 టీఎంసీ నీరు ప్రాజెక్టులో చేరినట్లు అధికారులు తెలిపారు. మొదట తొమ్మిది రోజుల పాటు ప్రాజెక్టులో 0.5 టీఎంసీల నీరు నింపేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కానీ దీనికి భిన్నంగా నాలుగు రోజులకే పంప్ నిలిపివేయడంతో ప్రాజెక్టులోకి ఆశించిన స్థాయిలో నీరు రాలేదు. మళ్లీ నీటిని ఎప్పుడు విడుదల చేస్తారనే దానిపై అధికారులు స్పష్టతను ఇవ్వలేదు. ఇప్పటికే ఎడమ కాలువ తూము షట్టర్ బిగింపు పనులు పూర్తి కాగా, కుడి కాలువ పనులు చివరిదశకు చేరుకున్నాయి. అదేవిధంగా ప్రాజెక్టు కట్టపై మరమ్మతు, గ్రీనరీ పనులు కొనసాగుతున్నాయి.

అవార్డులకు గ్రామాలు పోటీ పడాలి

అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

సిద్దిపేటరూరల్: స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ – 2023 అవార్డుల కోసం పోటీపడేందుకు జిల్లాలోని ప్రతి గ్రామాన్ని సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ మీటింగ్ హాల్‌లో డీఆర్డీఏ, డీపీఓ, ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓలు, పలు పంచాయతీ సెక్రటరీలతో అదనపు కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీఏ పీడీ చంద్రమోహన్‌రెడ్డి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ – 2023కు సంబంధించి పలు అంశాలు, వాటికి కేటాయించిన మార్కుల వివరాలను తెలియజేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి మండలాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ – 2023 ఢిల్లీ బృందం ప్రతి గ్రామానికి ప్రత్యక్ష పరిశీలనకు రానున్నందున పొరపాట్లు జరగకుండా చూసుకోవాలన్నారు. మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, తడి పొడి చెత్త సేకరణ ఇతర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంఘాలలో ఎస్‌హెచ్‌జీల సహకారంతో గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అధికారులు వచ్చినప్పుడు గ్రామాల్లో పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి వసతి, పబ్లిక్ టాయిలెట్స్, ఏ అంశాన్ని వదలకుండా అనీన గమనిస్తారన్నారు. ప్రతీ అధికారి గ్రామాల్లో మీటింగ్‌లు పెట్టి పంచాయతీ సెక్రటరీ, గ్రామ సర్పంచ్, వార్డు మెంబర్లకు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023లోని పలు అంశాల గురించి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఓ దేవకిదేవి, జెడ్పీ సీఈఓ రమేష్, అడిషనల్ డీఆర్డీఏ పీడీ, తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో బహిరంగ వేలం



వేలం నిర్వహిస్తున్న ఆలయ ఈఓ బాలాజీ, చైర్మన్ భిక్షపతి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో మంగళవారం ఆలయానికి సంబంధించిన పలు అంశాలపై ఈ టెండర్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలం పాటను ఆలయ ఈవో బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించారు. మల్లన్న సమావేశ మందిరంలో ఎల్లమ్మ ఆలయం వద్ద కొబ్బరి కాయల విక్రయం, కొబ్బరి ముక్కల సేకరణ, తలనీలాల సేకరణ, మొక్కుబడి బియ్యం, వస్త్రాలు, పసుపు సేకరణ, కోరమీసాలు అమ్ముకునే హక్కులు పొందేందుకు ఈ టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించారు. సరియైన పాట రాకపోవడంతో తలనీలాల సేకరణ, స్వామి వారి మొక్కుబడి బట్టలు, ఒడి బియ్యం, పసుపు సేకరణ, కొబ్బరి ముక్కల సేకరణ హక్కులకు సంబంధించిన టెండర్లను వాయిదా వేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సిద్దప్ప, ఆలయ ఏఈవో అంజయ్య, ప్రధాన అర్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ ధర్మకర్తలు రఘువీరారెడ్డి, సౌజన్య పాల్గొన్నారు.

'బీడీ కార్మికుల బతుకులతో చెలగాటం'



కార్మికులతో తుమ్మ శంకర్

దుబ్బాకటౌన్: బీడీ కార్మికుల బతుకులతో దేశాయి బీడీ యాజమాన్యం చెలగాటం ఆడుతుందని, బలవంతంగా పిటార కంపెనీ పేరుతో పొట్లాలను అంటగడుతూ తీవ్ర ఇబ్బందులు గురిచేయడం దారుణమని తెలంగాణ ఆల్ బీడీ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు తుమ్మ శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం దుబ్బాకలో ఆయన బీడీ కార్మికులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. ప్రతినెల బీడీ కార్మికులు ఒక్కొక్కరి నుంచి రూ.300 నుంచి రూ.500 వరకు వసూలు చేసి పిటార పొట్లాలు ఇస్తున్నారని ఆరోపించారు. దీనిపై ఇటీవలే రాష్ట్ర జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ చతుర్వేదికి ఫిర్యాదు చేశామని, పొట్లాలు ఇస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు. త్వరలోనే మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్, మల్లారెడ్డి, ఎంపీ ప్రభాకర్‌రెడ్డిలను కలిసి సమస్యను వివరిస్తామన్నారు. కార్మికులు పొట్లాలు తీసుకోవద్దని చెప్పారు. సమావేశంలో లక్ష్మి, చంద్రకళ ఉన్నారు.

రిజర్వ్ బ్యాంకు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు



విద్యార్థులను అభినందిస్తున్న అగర్వాల్

సిద్దిపేటజోన్ / జగదేవ్‌పూర్ (గజ్వేల్): రిజర్వ్ బ్యాంకు ఆర్థిక విభాగం ఆధ్వర్యంలో లిటరసి ఫర్ స్కూల్ చిల్డ్రన్ పేరిట మంగళవారం జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. స్థానిక గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో పోటీలు జరిగాయి. మొదటి స్థానంలో పాములపర్తి జిల్లా పరిషత్ పాఠశాల, ద్వితీయ స్థానంలో ఇందిరా నగర్ జడ్పీ పాఠశాల, మూడో స్థానంలో లచ్చపేట జడ్పీ పాఠశాల నిలిచింది. ఈనెల 10న హైదరాబాద్ అబిడ్స్ తాజ్‌హోటల్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరుకానున్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన వారిని ఆర్బీఐ నోడల్ అధికారి అంకిత్ అగర్వాల్ అభినందించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సత్యజిత్, రాజలింగం పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏబీవీపీ నాయకులు


సిద్దిపేటరూరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వివేక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఏబీవీపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మూసివేసిన 8,624 ప్రభుత్వ పాఠశాలలను పునః ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణకు చట్టం తీసుకురావాలన్నారు. స్కాలర్ షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్‌ను రూ.3,500కు పెంచాలని డిమాండ్ చేశారు. టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేసి ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సావుల ఆదిత్య, సిద్దిపేట నగర కార్యదర్శి పవన్, ఏబీవీపీ బాధ్యులు సంతోష్, సంజయ్, పరుశరాం, చరణ్, ప్రణయ, వసంత్, రాకేష్, అంజి పాల్గొన్నారు.

కవితా పోటీల ఫలితాలు విడుదల

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సామాజిక చైతన్య స్ఫూర్తి కలిగించేలా అక్షరసేద్యం ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన కవితా పోటీల ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దుర్గయ్య, రాజు మాట్లాడారు. పోటీలకు 286 కవితలు వచ్చాయన్నారు. ప్రముఖ కవి, మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి న్యాయ నిర్ణేతగా వ్యవహరించి ఎనిమిది కవితలను ఎంపిక చేసినట్లు చెప్పారు. ప్రథమ బహుమతి(రూ.2వేలు) కరీంనగర్ పెనుగొండ బసవేశ్వర్ రచించిన మనిషిజాడ, ద్వితీయ బహుమతి(రూ.1500) జగిత్యాల చిందం రమేశ్ రచించిన పశువు, తృతీయ బహుమతి(రూ.1000) హైదరాబాద్‌కు చెందిన మల్లిపూడి రవిచంద్ర రచించిన కొత్తగా చిగురించాలి గెలుచుకున్నారు. ప్రత్యేక బహుమతులు (రూ.500) పార్వతీపురం అప్పలనాయుడు పనిదేవత, కళాగోపాల్ ఖాళీ మనుషులు నిజామాబాద్, ఐపోలవరం నాగజ్యోతిశేఖర్ నన్ను నన్నులా, నూజివీడు సుబ్బారావు ఎన్నాళ్లుంటారు రోడ్లమీద, లక్సెట్టిపేట రాజేశ్వర్‌రావు అవిభాజ్యదుఃఖంలు గెలుచుకున్నాయి. వీటితో పాటు మరో 26 కవితలను ఎంపిక చేసి కవితా సంకలనం రూపొందించి బహుమతి ప్రదానం రోజున పుస్తకాన్ని ఆవిష్కరిస్తామన్నారు.

శ్మశాన వాటిక కూల్చివేతపై ఆందోళన

- మెగా క్యాంపు కార్యాలయం ఎదుట చెత్తవేసి నిరసన
- మల్లన్న సాగర్ అధికారులు, కాంట్రాక్టర్లపై ఫిర్యాదు



ఓపెన్ కెనాల్ వద్ద పనులు అడ్డుకుని వంటావార్పు చేస్తున్న తుక్కాపూర్ గ్రామస్తులు

తొగుట(దుబ్బాక): మండలంలోని తుక్కాపూర్ శ్మశానవాటిక, డంప్ యార్డులను కూల్చివేయడంతో గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మంగళవారం మెగా క్యాంపు కార్యాలయం ఎదుట చెత్తవేసి నిరసన తెలిపారు. తొగుట ఎస్ఐ కర్ణాకర్‌రెడ్డి అక్కడి చేరుకుని పరిస్థితిని అదుపుచేశారు. సోమవారం రాత్రి మల్లన్న సాగర్ అధికారులు శ్మశాన వాటిక, డంప్ యార్డులను కూల్చివేశారంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తమకు సమాచారం ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని గ్రామస్తులు మండిపడ్డారు. సర్పంచ్ చిక్కుడు చంద్రం ఆధ్వర్యంలో టీఎంసీ ఓపెన్ కెనాల్ నిర్మాణ పనులు అడ్డుకుని వంటావార్పుతో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రం మాట్లాడుతూ మల్లన సాగర్ నిర్మాణం కోసం భూములు అందించి తుక్కాపూర్ ప్రజలు త్యాగం చేశారని తెలిపారు. మల్లన్న సాగర్ ఇరిగేషన్ అధికారులు శ్మశాన వాటికను కూల్చివేయడం దుర్మార్గమని, తమ మనోభావాలు దెబ్బతిశారంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, మల్లన్న సాగర్ అధికారులు ఆందోళన విరమించాలని కోరినా గ్రామస్తులు వినిపించుకోలేదు. ఈఈ సాయిబాబ, డీఈ రమేష్, కేవీఆర్ కన్స్‌స్ట్రక్షన్స్ ఇన్‌చార్జి ఆనంద్‌పై తొగుట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఎట్టకేలకు బదిలీలు



ఇర్కోడ్ మోడల్ స్కూల్

- పదేళ్లుగా ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులు
- ఉమ్మడి మెదక్‌లో 31 మోడల్ స్కూళ్లు, 600 మంది టీచర్లు
- నేటి నుంచి 7వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ
- 20 నుంచి 23వ తేదీ వరకు ట్రాన్స్‌ఫర్ ఉత్తర్వులు

సాక్షి, సిద్దిపేట: ఎట్టకేలకు మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలకు రంగం సిద్ధమైంది. పదేళ్ల నుంచి బదిలీలు జరగలేదు. మూడేళ్ల నుంచి బదిలీలు చేపట్టాలని ఉపాధ్యాయులు ఆందోళనలు చేస్తున్నారు. మోడల్ స్కూల్ టీచర్ల బదిలీలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎడ్యుకేషన్ డైరెక్టర్ దేవసేన విడుదల చేశారు. దీంతో ఎంతో కాలంగా బదిలీల కోసం ఎదురుచూస్తున్న టీచర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 31 మోడల్ స్కూళ్లు ఉండగా, అందులో 600 మంది టీచర్లు ఉన్నారు.

- 2013–2014 సంవత్సరంలో ఏ స్కూల్‌లో రిక్రూట్ అయ్యారో..అప్పటి నుంచి అదే స్కూల్‌లో పని చేస్తున్నారు.
- హైకోర్టులో కేసు ఉండటంతో పాత జోన్ల ప్రకారమే బదిలీలు జరగనున్నాయి.

మోడల్ స్కూళ్లు, టీచర్ల వివరాలు

జిల్లా	స్కూళ్లు	పీజీటీ	టీజీటీ
సిద్దిపేట	14	166	42
సంగారెడ్డి	10	95	40
మెదక్	07	70	35

ప్రిన్సిపాళ్లను రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని బదిలీ చేస్తారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ), ట్రైన్డ్ గ్యాడ్యుయేట్ టీచర్లు (టీజీటీ) లకు జోన్ యూనిట్‌గా బదిలీలు ఉండనున్నాయి.

- బదిలీ కోసం ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దాని ప్రింటౌట్‌ను ప్రిన్సిపాళ్లకు అందించాలి.
- 8న వెబ్‌సైట్‌లో ఖాళీల ఫైనల్ జాబితాను పెట్టనున్నారు. 18, 19 తేదీల్లో వెబ్ ఆప్షన్లు ఇవ్వాలి.
- 20 నుంచి 23వ తేదీ వరకు బదిలీల ఉత్తర్వులను విడుదల చేస్తారు. 23 నుంచి 26వ తేదీ వరకు కొత్త స్కూళ్లలో జాయిన్ కావాలి.

అంతా ఆన్‌లైన్‌లోనే..



బదిలీల ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లో జరగనుంది. దరఖాస్తు చేసుకున్న వారు స్థానిక మోడల్ స్కూళ్ల ప్రిన్సిపాల్‌లకు దరఖాస్తులను అందజేయాలి. ప్రిన్సిపాళ్ల నుంచి వాటిని స్వీకరించి రాష్ట్ర విద్యాశాఖకు పంపిస్తాం.

–శ్రీనివాస్ రెడ్డి, డీఈఓ

పదేళ్ల నుంచి ఎదురు చూస్తున్నాం



అపాయింట్‌మెంట్ అయినప్పటి నుంచి ఒకే స్కూల్‌లో విధులు నిర్వర్తిస్తున్నాం. ఇతర జిల్లాలకు చెందిన వారు కూడా అపాయింట్ అయ్యారు. పదేళ్ల నుంచి బదిలీల కోసం ఎదురు చూస్తున్నాం. బదిలీల ప్రక్రియను చేపట్టిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు.

రవీందర్, టీఎంఎస్‌టీఏ జిల్లా అధ్యక్షుడు, సిద్దిపేట

గజ్వేల్‌లో హైటెన్షన్..!

- రెండోరోజూ కొనసాగిన ఘర్షణ
- ర్యాలీలో రాళ్లు రువ్వుకున్న ఇరువర్గాలు
- బంద్ పిలుపుతో దుకాణాల మూసివేత
- భారీగా పోలీసుల మోహరింపు
- పట్టణంలో 144 సెక్షన్ విధింపు


రాస్తారోకో చేస్తున్న ఆందోళనకారులతో మాట్లాడుతున్న సిద్దిపేట సీపీ శ్వేత

గజ్వేల్: గజ్వేల్ పోలీసుల చక్రబంధంలో కొనసాగుతుంది. పిడిచెడ్ రోడ్డు వైపున ఉన్న ఛత్రపతి శివాజీ విగ్రహానికి జరిగిన అవమానకర ఘటనలో పట్టణంలో తలెత్తిన ఉద్రిక్తతను కట్టడి చేసేందుకు మంగళవారం 144 సెక్షన్ విధించడమే గాకుండా రాజన్న–సిరిసిల్ల జోన్ డీఐజీ రమేష్‌నాయుడు, సిద్దిపేట సీపీ శ్వేతల ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు చేపట్టారు. విగ్రహానికి జరిగిన అవమానం, యువకునిపై దాడి నిరసిస్తూ ఇచ్చిన బంద్ పిలుపు నేపథ్యంలో పట్టణంలో వ్యాపార, వాణిజ్య, విద్యా సంస్థలు మూతపడ్డాయి. బంద్ సందర్భంలో ఓ వర్గం పట్టణంలోని ప్రధాన రహదారిగుండా పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించింది. పిడిచెడ్ రోడ్డు వైపు నుంచి అంబేడ్కర్ చౌరస్తా, ఇందిరాపార్కు చౌరస్తాల మీదుగా మార్కెట్ రోడ్డువైపు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంలో మార్కెట్ రోడ్డు వైపున ఆకతాయిలు కొందరు రాళ్లు రువ్వడంతో మళ్లీ ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ ఉద్రిక్తత రెండు వర్గాల మధ్య మరోసారి వివాదం రాజేసింది. ఫలితంగా ఘర్షణ వాతావరణం నెలకొంది. కొద్దిసేపు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. పోలీసులు అప్రమత్తమై ఇరువర్గాలను చెదరగొట్టడంతో ఉద్రిక్తత సడలింది. ఇదే సమయానికి అక్కడికి చేరుకున్న సిద్దిపేట సీపీ శ్వేత గందరగోళ పరిస్థితులను తెరదించేందుకు పోలీసులకు గట్టి ఆదేశాలిచ్చారు. ఎక్కడివారిని అక్కడ తరిమేశారు. ఆ తర్వాత ర్యాలీ నిర్వహించిన వారంతా అంబేడ్కర్ చౌరస్తా వద్దకు చేరుకొని రాస్తారోకో చేపట్టారు. విగ్రహాన్ని అవమానించిన ఘటనలో ఎలాంటి చర్యలు తీసుకున్నారో పోలీసులు ఇప్పుడే స్పష్టం చేయాలనే డిమాండ్‌తో నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంలో సీపీ శ్వేత విగ్రహాన్ని అవమానించిన ఘటనలో యువకునిపై దాడిచేసిన ఘటనలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌కు చెందిన ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. దీంతో శాంతించిన ఆందోళనకారులు అక్కడినుంచి వెళ్లిపోయారు.

ప్రశాంతతకు విఘాతం కలిగించొద్దు : సిద్దిపేట సీపీ శ్వేత

గజ్వేల్ పట్టణంలో అన్ని వర్గాల ప్రజలు సంయమనంతో వ్యవహరించి పోలీస్‌శాఖతో సహకరిస్తే ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందని సిద్దిపేట సీపీ శ్వేత అన్నారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పిడిచెడ్ రోడ్డు వైపున ఉన్న విగ్రహానికి అవమానం ఘటనలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సంగాపూర్‌కు చెందిన ఇమ్రాన్, మరో రెండు ఘటనలకు సంబంధించి అఖిల్, జహీర్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు వెల్లడించారు. ఈ కేసుల్లో మరికొంతమంది నిందితులను సైతం గుర్తించి వారిని కూడా అరెస్టు చేస్తామన్నారు.

ఫేక్ న్యూస్‌లను నమ్మొద్దు : సిద్దిపేట జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

ఫేక్‌న్యూస్‌లను నమ్మొద్దని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ సూచించారు. గజ్వేల్ పట్టణంలో నెలకొన్న ఉద్రిక్తత నేపథ్యంలో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలో అన్ని వర్గాల ప్రజలు సంయమనంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఎవరు కూడా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవద్దన్నారు. ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని సూచించారు.

ఐదుగురి అరెస్ట్

పట్టణంలో సంఘటనలకు సంబంధించి ప్రత్యేక బృందాల ద్వారా గుర్తించిన నలుగురిని అరెస్టు చేసినట్లు సిద్దిపేట సీపీ శ్వేత వెల్లడించారు. ఇందులో గజ్వేల్ మండలం బూర్గుపల్లి గ్రామానికి చెందిన మూషణం కరుణాకర్‌గౌడ్, వర్గల్ మండలం గౌరారం గ్రామానికి చెందిన మఠం మహిపాల్, గజ్వేల్ పట్టణానికి చెందిన కాశమైన నవీన్, గచ్చుబాయి మహేష్‌గౌడ్‌లు, ప్రజ్ఞాపూర్‌కు చెందిన సాయితేజ ఉన్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

విద్యుత్ విజిలెన్సు అధికారుల దాడులు

52 మందిపై కేసులు నమోదు

అల్లాదుర్గం(మెదక్): అల్లాదుర్గం మండలంలో మంగళవారం విద్యుత్ విజిలెన్సు అధికారులు అకస్మికంగా దాడులు నిర్వహించారు. మండల పరిధిలోని రాంపూర్, సీతానగర్, కాయిదంపల్లి, అప్పాజిపల్లి, మందాపూర్, చిల్వెర, ఐబీ తండాలలో దాడులు చేపట్టారు. విద్యుత్ అక్రమంగా వాడుకుంటున్నా 52 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఏఈ నాగరాజు చెప్పారు. విద్యుత్ అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ దాడులలో అల్లాదుర్గం ఏఈ యాసిన్, అసిస్టెంట్ ఇంజనీర్ నవాజ్‌లు పాల్గొన్నారు.

షాకిచ్చిన కరెంట్ బిల్లు

నెల రోజులకు రూ.6,66,310


విద్యుత్ బిల్లు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని ఎనగండ్ల గ్రామపంచాయతీ దుంపలకుంట చౌరస్తాలోని ఓ ప్రథమ చికిత్స కేంద్రానికి లక్షల విద్యుత్ బిల్లు రావడం చర్చనీయాంశమైంది. జూన్ నెల 30రోజులకు గాను 80,117 యూనిట్ల కరెంటు వినియోగించినట్లుగా రూ. 6,66,310ల బిల్లు రావడంతో వినియోగదారు డు రవితేజ అవాక్కయ్యాడు. కేంద్రంలో ఒక ఫ్యాను, రెండు ట్యూబ్‌లైట్లు మాత్రమే ఉన్నాయని, వాటికి ఇంత బిల్లు ఎలా వచ్చిందో తెలియడంలేదని వాపోయాడు. దీనిపై విద్యుత్ అధికారులను కలవనున్నట్లు తెలిపాడు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


దుర్గయ్య (ఫైల్)

రామాయంపేట(మెదక్): ఝాన్సిలింగాపూర్‌లో విద్యుదాఘాతంతో నల్ల దుర్గయ్య(60) అనే రైతు మృతిచెందాడు. గ్రామ శివారులోని ఎర్రగుంట కట్టపై ట్రాన్స్‌ఫార్మర్ సమీపాన ఫీజు వైరు వేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో దుర్గయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని స్థానికులు మృతుడి కుటుంబ సభ్యులకు చేరవేశారు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రంజిత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దగ్ధమైన ట్రాలీ ఆటో



జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని వావిలాల గడ్డపోతారం ప్రధాన రహదారి పక్కన మూడు రోజుల నుంచి ఓ ట్రాలీ ఆటో ఉంది. మంగళవారం ఉదయం ఈ ఆటో కాలిపోతూ కనిపించింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆటోను తగల బెట్టిఉంటారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై విచారణ జరుపుతున్నామని పోలీసులు పేర్కొన్నారు.

ఇళ్ల స్థలాల పంపిణీకి ఏర్పాట్లు సిద్ధం

పుల్‌కల్(అందోల్): సింగూరు పునరావాస లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలను పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను సిద్ధం చేసినట్లు ఆర్డీఓ అంబదాస్ తెలిపారు. ఈ మేరకు ఆర్డీఓ మంగళవారం సింగూరు గ్రామాన్ని సందర్శించి స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజయ్య, ఆర్‌ఐ మహదేవ్ పాల్గొన్నారు.

'వేధింపులకు గురి చేస్తే చర్యలు'


మాట్లాడుతున్న సీఐ దుర్గ

కొమురవెల్లి(సిద్దిపేట): అమ్మాయిలను వేధింపులకు గురి చేసినా, మానసికంగా, శారీరకంగా హింసించినా వెంటనే షీటీమ్‌ను సంప్రదించాలని సిద్దిపేట మహిళాపోలీస్ స్టేషన్ సీఐ దుర్గ అన్నారు. మంగళవారం పోలీస్ కమిషనర్ ఆదేశాలనుసారం మండలంలోని అయినాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీలకు మహిళల రక్షణకు ఉన్న చట్టాలు పోక్సో, బాల్యవివాహాలు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్, యూటీజింగ్, ర్యాగింగ్, బ్యాడ్‌టచ్, ఉమెన్ షీటీమ్ గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా బాలబాలికల రక్షణ, మహిళల రక్షణ గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో ఫొటోలను మార్ఫి వేధింపులకు గురి చేసిన వారి వివరాలను పోలీసులకు తెలిపితే వెంటనే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థి దశలో ఇష్టంగా చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించి తల్లి దండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై పడి తాపీ కార్మికుడి మృతి


నర్సయ్య (ఫైల్)

వర్గల్(గజ్వేల్): మద్యం మత్తులో రోడ్డుపై పడి తాపీ కార్మికుడు మృతి చెందాడు. గౌరారం ఎస్‌ఐ సంపత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..తున్కిమక్తకు చెందిన నర్సగల్ల సత్తయ్య(45) తాపీ కార్మికుడు. అతనికి భార్య మైసమ్మ, ఇద్దరు కొడుకులున్నారు. తాపీ పనులు ముగించుకొని రోజూ మద్యం తాగేవాడు. సోమవారం ఇంట్లో దుర్గమ్మ పండుగ చేసుకున్నారు. అనంతరం సాయంత్రం ఇంట్లో చెప్పి బయటికి వెళ్లాడు. రాత్రయినా తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన కుటుంబీకులు, గ్రామస్తులతో కలిసి చుట్టు పక్కల వెతికారు. అర్ధరాత్రి దాటిన తరువాత తున్కిమక్త–మీనాజీపేట మార్గంలో చింత చెట్టు కింద సత్తయ్య మృతదేహం కనిపించింది. భార్య మైసమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మూడు బైక్‌లను ఢీకొన్న డీసీఎం

ఇద్దరు మృతి...
మరో ఇద్దరికి తీవ్ర గాయాలు


ఘటనాస్థలంలో మృతదేహం

పటాన్‌చెరు టౌన్: జాతీయ రహదారిపై వెళుతున్న మూడు బైక్‌లను ఓ డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పటాన్‌చెరు ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం..పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ నుంచి సంగారెడ్డి వైపు వెళ్లే జాతీయ రహదారిపై మంగళవారం ఇస్నాపూర్ చౌరస్తా వద్ద వెనుక నుంచి వచ్చిన డీసీఎం ముందు వెళుతున్న మూడు బైక్‌లను ఢీకొట్టింది. ఈ ఘటనలో ఏపీలోని నెల్లూరు జిల్లా నాయుడుపేటకు చెందిన సురేష్ ఆచార్య(45), ఇస్నాపూర్ గ్రామానికి చెందిన ధరావత్ రామచందర్(52) అక్కడికక్కడే మృతి చెందారు. ఇదే ఘటనలో బైక్ నడిపిన సునీల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరో ద్విచక్ర వాహనదారుడు గోపాల్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి. మృతుడు సురేష్ ఇస్నాపూర్‌లో స్నేహితుడి వద్ద ఉంటూ శిల్పకళాకారుడిగా పనిచేస్తున్నాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రామచందర్, సురేష్ ఆచార్య మృతదేహాలను పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రి తరలించారు. గాయాలపాలైన సునీల్, గోపాల్‌లను చికిత్స కోసం తరలించారు. మృతుడు సురేష్ ఆచార్య స్నేహితుడు సందీప్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం లారీ పట్టివేత


పట్టుబడిన ధాన్యం లారీతో అధికారులు

రామాయంపేట, తూప్రాన్(మెదక్): నార్సింగి మండల కేంద్రంనుంచి అక్రమంగా తరలుతున్న ధాన్యం లారీని మంగళవారం రాత్రి తూప్రాన్‌వద్ద పౌర సరఫరాలశాఖ అధికారులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు, పత్రాలు లేకుండా నార్సింగిలోని భాగ్యలక్ష్మి రైస్ మిల్లునుంచి తరలుతున్న వడ్లలోడును పట్టుకున్నామని పౌరసరఫరాల జిల్లా అధికారి శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో తెలిపారు.

పాఠశాల గోడకూలి విద్యార్థికి గాయాలు


చికిత్స పొందుతున్న విద్యార్థి

ఝరాసంగం(జహీరాబాద్): పాఠశాల గోడ కూలి విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. ఝరాసంగానికి చెందిన జశ్వంత్ ఝరాసంగంలోని కేంద్రీయ విద్యాలయంలో తొమ్మిదోతరగతి చదువుతున్నాడు. మూత్రవిసర్జనకు వెళ్లిన అతను మూత్రశాల వద్ద అడ్డంగా కట్టిన గోడ సోమవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు కూలి జశ్వంత్ కాలుకు గాయాలయ్యాయి. దీంతో విద్యార్థి ఎడమ కాలు విరగటంతో జహీరాబాద్ పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నిర్మించడంతోనే ప్రమాదం జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఏఎస్‌ఐ సురేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..పటాన్‌చెరు పట్టణంలోని శ్రీనగర్ కాలనీకి చెందిన రామారావు(52) పాటీ గ్రామ సమీపంలోని మంజీర మిషన్ వద్ద సెక్యూరిటీ గార్డుగా పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీన రాత్రి నడుచుకుంటు వర్షంలో ఇంటి నుంచి బస్టాండ్ వైపు వెళ్లాడు. ఈ క్రమంలో బజాజ్ ఎలక్ట్రానిక్స్ సమీపంలోకి రాగానే అతడు కాలుజారి పడటంతో తలకు బలమైన గాయమైంది. కుటుంబ సభ్యులు అతణ్ని చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లోన్ ఇప్పిస్తామంటూ సైబర్ మోసం



జగదేవ్‌పూర్(గజ్వేల్): లోన్ ఇప్పిస్తామంటూ సైబర్ మోసానికి గురైన ఘటన మంగళవారం మండలపరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం..మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి బజాజ్ ఫైనాన్స్ నుంచి మాట్లాడుతున్నామని, మీకు లోన్ ఇప్పిస్తామని నమ్మబలికాడు. ఆ మాటలు నమ్మిన బాధితుడు అతని వివరాలు పంపించాడు. రూ. లక్ష లోన్ మంజూరు చేయించాలంటే జీఎస్టీ, డాక్యుమెంటేషన్ ఇతర ఖర్చుల కింద డబ్బులు పంపాలని చెప్పడంతో గుర్తు తెలియని వ్యక్తి చెప్పిన విధంగా ఫోన్ పే ద్వారా రూ.42,609లు పంపించాడు. అనంతరం అనుమానంతో అదే నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. బాధితుడు మోసపోయానని గుర్తించి వెంటనే జాతీయ హెల్ప్ లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఫేస్‌బుక్‌లో బైక్ చూసి..

గజ్వేల్ మండలానికి చెందిన ఓ బాధితుడు సైబర్ మోసానికి గురై రూ.33,597లు పోగొట్టుకున్నాడు. ఫేస్‌బుక్‌లో బైక్ చూసి దాన్ని కొనుగోలు చేసే క్రమంలో ఆన్‌లైన్‌లో ఆర్మీ జవాన్ పేరిట డబ్బులు పంపించి మోసపోయాడు. అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో వెంటనే జాతీయ సైబర్ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు.

ఇంటి అద్దె చెల్లించి..

సిద్దిపేటజోన్: సిద్దిపేట పట్టణానికి చెందిన ఒక వ్యక్తి ఇంటి అద్దె కోసం ఓఎల్ఎక్స్‌లో ఇంటి అద్దె కోసం సెర్చ్ చేశాడు. అందులో ఉన్న ఒక నంబర్‌ను బాధితుడు సంప్రదించాడు. ఫోన్‌లో గుర్తు తెలియని వ్యక్తి తను ఆర్మీ జవాన్ అని ఆధార్, గుర్తింపు కార్డ్ చూపి బాధితుడిని నమ్మించాడు. వీడియో ద్వారా ఇల్లు చూపించి, ఇంటి అద్దె పేరిట అడ్వాన్స్ ఇవ్వాలని సూచించాడు. అది నమ్మిన బాధితుడు రూ.35వేలు ఫోన్ పే ద్వారా పంపించాడు. అనుమానంతో బాధితుడు అదే నెంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. అనంతరం బాధితుడు వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు.

పార్ట్ టైం జాబ్ ఉందంటూ..

పటాన్‌చెరు టౌన్: సైబర్ వలలో ఇద్దరు ప్రైవేట్ ఉద్యోగులు మోసపోయారు. ఈ సంఘటన అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..బీరంగూడ బ్యాంక్ కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి మార్చి 28వ తేదీన పార్ట్ టైం జాబ్ ఉందంటూ మెసేజ్ వచ్చింది. దీన్ని నమ్మిన బాధితుడు కొంత మొత్తం నగదు పెట్టుబడిగా పెడితే కమిషన్ ఇస్తామని గుర్తు తెలియని వ్యక్తి చెప్పడంతో తన వివరాలను నమోదు చేసి పలు దఫాలుగా మొత్తం రూ.1,25,000లు పెట్టాడు. పెట్టిన నగదుతో పాటు కమిషన్ ఇవ్వాలని అడగడంతో స్పందించలేదు. దీంతో బాధితుడు తను మోసపోయినట్టు గుర్తించి సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు.

మరోఘటనలో..

బీరంగూడ సాయి కాలనీకి చెందిన మరో వ్యక్తికి జాబ్ ఆఫర్ అంటూ మార్చి 21 తేదీన మెసేజ్ వచ్చింది. నగదు ఇన్వెస్ట్ చేస్తే కమిషన్ ఇస్తామని ఆశ చూపి బాధితుడు తన వివరాలను గుర్తు తెలియని వ్యక్తికి చేరవేశాడు. దీంతో అది నమ్మిన బాధితుడు పలు దఫాలుగా రూ.2,27,000లు పోగొట్టుకున్నాడు. తను మోసపోయినట్టుగా గుర్తించిన బాధితుడు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనంతరం అమీన్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బ్యాంక్ ఖాతాలను హ్యాక్ చేసిన యువకుడు

పోలీసులకు తండా వాసుల ఫిర్యాదు

శివ్వంపేట(నర్సాపూర్): గూగుల్ అకౌంట్ జి మెయిల్ ఐడిని హ్యాక్ చేస్తూ ఓ వ్యక్తి డబ్బులు కాజేస్తుండడంతో పాటు అసభ్యకర మెసేజ్ పెడుతున్నాడని తండా వాసులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భీమ్లా పంచాయతీ తౌర్యా తండాకు చెందిన రాజు అకౌంట్లో నుంచి తరచూ డబ్బులు కట్ అవుతుండడంతో అనుమానం వచ్చి గూగుల్లో తన అకౌంట్‌కు సంబంధించి వివరాలు సేకరించాడు. ఇదే తండాకు చెందిన ఓ వ్యక్తి ఫినో బ్యాంకు ఏజెంటుగా వ్యవహరిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు వాపోయారు. పలువురి డబ్బులు తమతమ ఖాతాలనుంచి కట్ అవుతున్న విషయం ఏజెంటు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఈ విషయంలో అతను దురుసుగా ప్రవర్తిస్తున్నాడని తండా వాసులు వాపోయారు. ఉపాధిహామీ కూలీల డబ్బులు ఫినో బ్యాంకు ఏజెంటు సక్రమంగా అందించడంలేదని వారు పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో బాధితులు ఫిర్యాదు చేశారు.

నిజాయతీ చాటుకున్న 108 సిబ్బంది


నగదు, బంగారు ఆభరణాలను కుటుంబ సభ్యులకు అందజేస్తున్న 108 సిబ్బంది

సదాశివపేటకు(సంగారెడ్డి): పట్టణంలో వృద్ధురాలికి ద్విచక్ర వాహనం ఢీకొని 108 సిబ్బంది ఆ స్పత్రికి తరలించే క్రమంలో ఆమె డబ్బు, బంగారాన్ని కుటుంబ సభ్యులకు అందజేసి నిజాయతీ చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి..మండల పరిధిలోని రేజింతల్ గ్రామానికి చెందిన సావిత్రమ్మ (77) సదాశివపేట ఎస్బీఐ బ్యాంక్‌లో డబ్బులు డ్రా చేసుకొని వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో స్పృహ తప్పి పడిపోయింది. చుట్టుపక్కల వారు 108కు ఫోన్ చేయగా వెంటనే వచ్చి ఆమెను ఆసుపత్రిలో చేర్చారు. బాధితురాలు దగ్గర ఉన్న రూ. 10వేలు, రెండు బంగారు గంటలు, ఆరు వెండి గాజులు బాధితురాలి కుటుంబ సభ్యులకు ఇచ్చి తమ నిజాయతీ చాటుకున్నారు. అంబులెన్స్ సిబ్బంది రఘురాం, పైలెట్ కోరుమ పల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి


ఎన్ రవీందర్ (ఫైల్)

అక్కన్నపేట(హుస్నాబాద్): గుండెపోటుతో ఆర్టీసీ కండక్టర్ మృతి చెందాడు. ఈ సంఘటన అక్కన్నపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..వరంగల్ 01డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఎస్.రవీందర్(52) హన్మకొండ టూ అక్కన్నపేటకు మంగళవారం సాయంత్రం వచ్చిన ఆర్టీసీ బస్సులో అతడు అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. దీంతో అక్కడే ఉన్న స్థానిక ఎంపీటీసీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు ఆర్ఎంపీ వైద్యుని వద్ద ప్రథమ చికిత్స చేయించారు. అక్కడి నుంచి హుస్నాబాద్ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో చౌటపల్లిలో అంబులెన్స్‌లో ఎక్కించారు. ఆసుపత్రికి చేరే లోపే కండక్టర్ మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత..

రాయపోలు(దుబ్బాక): అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన సంఘటన రాయపోలు మండలం ముంగాజిపల్లి పరిధిలోని దళితవాడలో చోటుచేసుకుంది. రాయపోలు ఎస్‌ఐ మహబూబ్ తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన మద్దూరి విజయ్‌కుమార్, అనూష అలియాస్ లావణ్య(25)లు దంపతులకు ఆరేళ్ల కొడుకు, మూడేళ్ల కూతురులున్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య గొడవ జరుగుతుందని కుటుంబసభ్యులు తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం అనూష ఇంట్లో ఉరేసుకుని మృతి చెందింది. ఈ విషయాన్ని భర్త విజయ్‌కుమార్ మృతురాలి సోదరుడికి ఫోన్ ద్వారా సమాచారం చేరవేశాడు. తన కూతురుని భర్తతో పాటు అత్తామామలు రాంచంద్రం, రాజమణి, మరిది రజినీకాంత్‌లు హత్యచేసి ఆత్మహత్యగా చిత్రికరిస్తున్నారని లావణ్య కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. మృతురాలి తండ్రి సత్తయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళా కూలీలపై దాడి

నాలుగు తులాల పుస్తెల తాడు అపహరణ

తూప్రాన్: కూలీ పనులకు వెళ్లి వస్తున్న నలుగురి కూలీలపై బైక్‌పై వచ్చిన ముగ్గురు దుండగులు దాడి చేసి నాలుగు తులాల బంగారు పుస్తెల తాడును అపహరించిన సంఘటన పట్టణ పరిధిలోని హైదర్‌గూడ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్.సురేశ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాగూడకు చెందిన వడియారం లత, శంకరమ్మ, నీలమ్మ, స్రవంతి గ్రామ సమీపంలోని ఓ తోటలో కూలీ పనికి వెళ్లారు. పనులు ముగించుకుని గ్రామ సమీపంలోని కుంటకట్టపై నుంచి నడుచుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు బైక్ పై వచ్చి వారిని అడ్డగించారు. వడియారం లత మెడలోని పుస్తెల తాడును లాక్కునే ప్రయత్నం చేయగా వారు ప్రతిఘటించారు. దీంతో మహిళలపై దాడి చేసి లత మెడలోని సుమారు 4 తులాల బంగారు పుస్తెల తాడును తెంపుకొని వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ఘటనలో ఇద్దరి ఆత్మహత్య

ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక ఒకరు,
ఉరేసుకొని వివాహిత మృతి చెందారు.


బాల్‌రాజు (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): ఆర్థిక ఇబ్బందులు తట్టుకోలేక కూలి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామానికి చెందిన గోనెల బాల్‌రాజు(40)కు భార్య రజిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల వారు ఇంటి నిర్మాణానికి అప్పులు చేశారు. మరోవైపు చిన్న కుమారుని ఆరోగ్యం బాగా లేకపోవడంతో అప్పులు చేసి వైద్యం నిమిత్తం ఖర్చుచేశారు. ఈ క్రమంలో కుమారుని ఆరోగ్యం బాగుపడక పోవడం, చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించకపోవడంతో మనస్థాపంతో బాల్‌రాజు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన భార్య రజిత 108వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ శివానందం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉరేసుకుని వివాహిత..

నర్సాపూర్: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..నర్సాపూర్‌లోని జగన్నాథరావు కాలనీలో నివాసం ఉండే మంగలి స్రవంతి(35) మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు చెప్పారు. భర్త శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పాముకాటుతో ఎద్దు మృతి


మృతి చెందిన ఎద్దు వద్ద కుమార్

రేగోడ్(మెదక్): పాముకాటుతో ఎద్దు మృతి చెందిన సంఘటన రేగోడ్‌లో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..గ్రామానికి చెందిన రైతు మామిడిపల్లి కుమార్ తన జోడెద్దులను చేనువద్ద ఉంచాడు. మధ్యాహ్నం 12 గంటలకు పాముకాటుకు గురై ఎద్దు మృతి చెందింది. విషయం తెలుసుకున్న కుమార్ బోరున విలపించాడు. ఎద్దు మృతితో సుమారు రూ.75వేలు నష్టం జరిగిందని, ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కుమార్ కోరాడు.

సీడ్ ఫర్టిలైజర్ షాపుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు


మిరుదొడ్డి(దుబ్బాక): అల్వాలలో తనిఖీ చేస్తున్న టాస్క్ ఫోర్స్ అధికారులు

హుస్నాబాద్: అక్కన్నపేట మండలంలోని రామవరంలో మంగళవారం సీడ్ ఫర్టిలైజర్ షాపుల్లో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో కాలం చెల్లిన విత్తనాలు 4 ప్యాకెట్లు, కాలం చెల్లిన పురుగు మందులు 500ఎంఎల్ రెండు బాక్స్‌లను, వాసవి ట్రేడర్స్ సీడ్ ఫర్టిలైజర్‌లో కాలం చెల్లిన విత్తనాలు 500 గ్రాములు 260 ప్యాకెట్లు, 200 గ్రాములవి 100 ప్యాకెట్లు స్వాధీనం చేసుకొని వ్యవసాయ అధికారి నాగరాజుకు అప్పగించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ సీఐ రమేష్ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పలు ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీలు చేశామన్నారు. కాలం చెల్లిన విత్తనాలు, పురుగుల మందులు అమ్మే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు వ్యవసాయ అధికారులు సూచించిన విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు.

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాలలోని సీడ్స్ అండ్ ఫర్టిలైజర్ షాపులో సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాలం చెల్లిన 200 ఎంఎల్ 11 బాక్సులను, 500 ఎంఎల్ రెండు బాక్స్‌లను స్వాధీనం చేసుకుని మండల వ్యవసాయ అధికారి మల్లేశంకు అప్పగించారు. ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ సీఐ రమేష్ మాట్లాడుతూ..కాలం చెల్లిన విత్తనాలు, నకిలీ పురుగుల మందులను అమ్మే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నకిలీ విత్తనాలు, కాలం చెల్లిన మందులను విక్రయించినట్లు తెలిస్తే పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూంకు 8712667100 సమాచారం అందించాలని వారు కోరారు.